క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గన్నేరువరం: జంగపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ రూరల్ పరిధిలో సోమవారం ఉదయం 8 నుంచి మాధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ లైన్ మెన్ శివకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గోపాల్‌పూర్, పీచుపల్లి గ్రామాల్లో విద్యుత్ ఉండదని, రైతులు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లందకుంట: టేకుర్తి మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాలకు ఈనెల 5 నుంచి 20 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.అయిలయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ ప్రతి గ్రూపులో 40 సీట్ల చొప్పున ఖాళీలున్నాయని, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రోత్సాహకం అందజేత



జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల వెలువడిన 10వతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించగా.. ఆదివారం ఉపాధ్యాయులు అభినందించారు. వంగల కావ్యశ్రీ 538, బాడిశె అమర్‌నాథ్ 503, గరిగె వైష్ణవి 500 మార్కులు సాధించగా.. దాత దండు భిక్షపతి రూ.2వేలు, రూ.1,500, రూ.1,000 నగదు బహుమతి అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు జరీనా అంజుమ్, ఉపాధ్యాయులు రాజేందర్, ఐలయ్య, అవినాశ్, రమేశ్, స్వామి, స్రవంతి, సంతోష్, రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

కరెంట్ సమస్యతో ఇబ్బందులు

చిగురుమామిడి: బొమ్మనపల్లి గ్రామంలో కరెంట్ సమస్యలతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా సంగం వాడలో రాత్రి, పగలు 24 గంటలపాటు వీధి లైట్లు వెలుగుతూనే ఉన్నాయని కాలనీవాసులు ఆరోపించారు. వీధి లైట్లకు ప్రత్యేకించి అమర్చిన ఫ్యూజ్‌ను తీసినా వీధి లైట్లు వెలుగుతున్నాయి. పలు గృహాల గోడలకు విద్యుత్ సరఫరా అవుతోందని, వాటిని పట్టుకున్నా, ముట్టుకున్నా షాక్ వస్తోందని ఆరోపించారు. కాలనీ కోసం అమర్చిన చిన్నపాటి ట్రాన్స్‌ఫార్మర్ పని చేయడం లేదని, దీనిపై స్థానిక విద్యుత్ లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని బదుకోలు సంజీవరెడ్డి, వీరమల్ల కనకయ్య, చింతపూల రాజయ్య, పలువురు ఆరోపించారు. స్థానికంగా విద్యుత్ సిబ్బంది ఉండటం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గన్నేరువరం: గుండ్లపల్లిలో ఇసుక ట్రాక్టర్ పట్టుకున్నట్లు ట్రైనీ ఎస్సై అరుణ్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం నుంచి గుండ్లపల్లి వైపు అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రక్తదానం



చొప్పదండి: భూపాలపట్నం గ్రామానికి చెందిన మునిగాల సుధాకర్‌గౌడ్ 45వసారి రక్తదానం చేశారు. కరీంనగర్లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో ఒక మహిళకు ఓ పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు. గొల్లపెల్లి నరేశ్, గాలిపెల్లి కుమార్ అభినందించారు.

శాంతి చర్చలు జరపాలి

జమ్మికుంట: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను చేపట్టి మవోయిస్టులు, అమాయక ఆదివాసుల చావులకు కారణమవుతోందని, మవోయిస్టులు శాంతి చర్చలకు అంగీకారం తెలిపారని, కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు చేపట్టాలని ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్ అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకర్లతో మాట్లాడారు.

కేంద్ర మంత్రి వ్యాఖ్యలు సరికాదు

శంకరపట్నం: మావోయిస్టులపై అంతిమ యుద్ధమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు సరికాదని సీనియర్ జర్నలిస్ట్, సామాజిక ఉద్యమకారుడు కొరిమి వెంకటస్వామి అన్నారు. కేశవపట్నంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరిట అడవినంతా పోలీస్ క్యాంపులు నింపి జల్లెడ పడుతున్నారన్నారు.

పండ్ల తోటల పెంపకానికి సబ్సిడీ



రోహిత్



టమాటా సాగు(ఫైల్)

గంగాధర: తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ విస్తీర్ణంలో పండ్ల తోటల పెంపకంతోపాటు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగులో రైతులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై పలు రకాల యంత్రాలను పంపిణీ చేస్తోందని ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి రోహిత్ పేర్కొన్నారు. పండ్లు, పూల తోటలు పెంచే రైతులకు నగదు రూపంలో రాయితీలను అందిస్తోందన్నారు. ఉద్యాన పంటల సాగుకు 2025–26 సంవత్సరానికి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, రాయితీలపై సాక్షికి వివరించారు.

పండ్ల తోటల పెంపకంలో హెక్టార్ మామిడి తోటకు రూ.19,200, నిమ్మ తోటకు రూ.19,200 జామ తోటకు రూ.19,200 అరటి తోటకు రూ.16,800, అవకాడోకు రూ.12,000 బొప్పాయి తోటకు రూ.7,200, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ.65,000 అందజేస్తోంది. ముదురు మామిడి తోటల పునరుద్ధరణ చేయడానికి రూ.9,600 సబ్సిడీ నగదు చెల్లించి ప్రోత్సహిస్తోంది.

కూరగాయల సాగుకు..

- టమాటా, వంగ, క్యాబేజీ, కాలిఫ్లవర్, మిర్చి నారు కోసం ప్రతి ఎకరాకు రైతులకు రూ.10వేల సబ్సిడీ అందజేస్తోంది.
- కూరగాయల సాగులో ప్లాస్టిక్ మల్చింగ్ చేసుకునే ప్రతి రైతుకు హెక్టార్‌కు రూ.20వేల రూపంలో నగదు సబ్సిడీని అందజేస్తారు.
- తీగ జాతి కూరగాయలు సాగు చేసే రైతులకు ప్రతి ఎకరాలో పందిళ్ల నిర్మాణానికి రూ.8వేల నగదు సబ్సిడీ అందిస్తోంది.

పూల సాగు..

పూల పంటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతి ఎకరాకు రూ.8వేల చొప్పున నగదు సబ్సిడీ అందజేస్తోంది.

యాంత్రీకరణ పరికరాలు

పంటల సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించడానికి పలు పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీని మంజూరు చేస్తోంది.

- 20 హెచ్‌పీ ట్రాక్టర్ కొనుగోలుపై రూ.2.45లక్షల సబ్సిడీ.
- పవర్ టిల్లర్ కొనుగోలుపై రూ.లక్ష సబ్సిడీ.
- పవర్ వీడర్ కొనుగోలుపై రూ.75వేల సబ్సిడీ అందజేస్తారు.
- బ్రష్ కట్టర్ కొనుగోలుపై రూ.25వేల సబ్సిడీ ప్రభుత్వం మంజూరు చేస్తోంది.

సూక్ష్మ నీటి సేద్యం

తక్కువ నీటి వినియోగం ద్వారా పంటల సాగు చేసేందుకు బిందు, తుంపర సేద్య పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీ, బీసీ రైతులకు 90 శాతం, సన్నకారు రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 80 శాతం సబ్సిడీపై పరికరాలను అందజేస్తోంది.

ఆయిల్‌పాం సాగు

ఆయిల్‌పాం సాగు చేసే రైతులను ప్రోత్సహించడానికి హెక్టార్‌కు రూ.10,500 చొప్పున నాలుగు సంవత్సరాల సబ్సిడీ నగదును అందజేస్తారు.

దరఖాస్తు విధానం

పండ్లు, కూరగాయలు, పూల పంటలు సాగు చేసే రైతులు నగదు సబ్సిడీతోపాటు సబ్సిడీపై పరికరాలు పొందడానికి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం జిరాక్స్ పేపర్లతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో సంబంధిత ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.



చిగురుమామిడి: బొమ్మనపల్లి–సుందరగిరి గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారి పక్కన మిషన్ భగీరథ పైపులైన్ కొన్ని నెలలుగా లీకవుతోంది. అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో లీకైన నీరు బయటకు వస్తూ మళ్లీ పైపులైన్‌లోకి వెళ్తోంది. సురక్షితమైన మంచినీరు కలుషితమయ్యే ప్రమాదముందని పలువురు బాటసారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



ఖాసీంపేటలో..



కొత్తగట్టులో బోనాలతో మహిళలు

పోచమ్మ బోనాలు

గన్నేరువరం: ఖాసీంపేట గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామ మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని డప్పుచప్పుళ్లతో గ్రామ వీధుల గుండా పోచమ్మ ఆలయానికి చేరుకొని నైవేద్యాలను సమర్పించారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శంకరపట్నం: కొత్తగట్టు గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాల జాతర జరిగింది. గీత కార్మికులు ఎల్లమ్మ జాతర పురస్కరించుకొని పోచమ్మ తల్లికి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు.

యువజన కార్యాలయం సందర్శన



ఎమ్మెల్యే సత్యంను సత్కరిస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని యువజన కాంగ్రెస్ కార్యాలయాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ ఆదివారం సందర్శించారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్ స్వాగతం పలికి పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సత్కరించారు. హుజూరాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చిన్నాల శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, కార్యదర్శులు వొల్లాల రవి, యేబూషి అజయ్, నాయకులు పచ్చిమట్ల భాను, వెంకటేశ్, ఎండీ జావిద్, సల్మాన్, చిరంజీవి, సత్యనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సప్తమ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్, భక్తులు

గన్నేరువరం: ఖాసీంపేట గ్రామంలోని శ్రీమానసాదేవి ఆలయ సప్తమ వార్షికోత్సవ పోస్టర్‌ను ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో ఆవిష్కరించారు. ఈనెల 8 నుంచి 10 వరకు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మానసాదేవిని దర్శించుకోవాలని కోరారు. చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, కోశాధికారి లక్ష్మీనారాయణ, బద్దం వెంకట్‌రెడ్డి, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బద్దం కరుణాకర్‌రెడ్డి, బద్దం శివారెడ్డి, బత్తుల కొమురయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



అనాథ ఆశ్రమం సందర్శన

రామడుగు: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల సిరిసిల్లకు చెందిన నాల్గో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆదివారం వెలిచాల గ్రామంలోని స్పందన అనాథ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. వృద్ధులతో కొద్దిసేపు గడిపిన విద్యార్థులు.. వారి బాగోగుల నడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ నిర్వాహకుడు మంచికట్ల శ్రీనివాస్, డాక్టర్ అరుణ్‌బాబు, డాక్టర్ ప్రియదర్శిని ఉన్నారు.

విరాళం అందజేత



విరాళం అందిస్తున్న దాతలు

ఇల్లందకుంట: రాచపల్లి గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి గుడి నిర్మాణానికి గ్రామ మాజీ సర్పంచ్ భూస ఆదిలక్ష్మి రూ.50వేలు, చుంచు రాజేశం రూ.35వేలను గౌడ సంఘం నాయకులకు ఆదివారం అందజేశారు. ఆరెల్లి మోహన్, భూస అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై పడిపోయిన ధాన్యం బస్తాలు


శంకరపట్నం: కేశవపట్నం బస్టాండ్ వద్ద ఆదివారం ట్రాక్టర్‌లోని ధాన్యం బస్తాలు కూలి రోడ్డుపై పడ్డాయి. హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన ఓ రైతు పండించిన వరి ధాన్యం ట్రాక్టర్‌లో మానకొండూర్ మండలానికి తీసుకెళ్తుండగా ధాన్యం బస్తాలు రోడ్డుపై పడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

కేంద్ర మంత్రికి ఆహ్వానం



హుజూరాబాద్: పట్టణంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈనెల 23న జరగనున్న ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు ఆలయ చైర్మన్ క్యాస చక్రధర్, ఆలయ అర్చకులు ఆహ్వాన పత్రం అందించారు. ఆలయ అర్చకులు చెరుకుపల్లి శ్రీధరాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు అరుణ్, శ్రవణ్, బీజేపీ నాయకుడు గంగిశెట్టి రాజు తదితరులున్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కరీంనగర్: కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడాన్ని నిరసిస్తూ ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో సార్వత్రిక సమ్మె పోస్టర్లు ఆవిష్కరించారు. లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరం అవుతుందని, కార్మికుల సమష్టి బేరసారాల శక్తి నిర్వీర్యం చేయబడుతుందని, ఉద్యోగ, ఉపాధి భద్రత కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, నగర కార్యదర్శి పుల్లెల మల్లయ్య, తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి, నాయకులు రాచకొండ శ్రీనివాస్, సురభి శ్రీకాంత్, కృష్ణ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ముక్కల శ్రీనివాస్, జగదీశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

సైదాపూర్: డ్రగ్స్ మహమ్మారి నుంచి విద్యార్థులు, యువకులను కాపాడుకొని మంచి సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మహిళా గ్రామైక్య సంఘాల సభ్యులతో ర్యాలీ తీశారు. సహకార సంఘం ఫంక్షన్ హాల్‌లో ఏపీఎం కుమారస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన డ్రగ్స్‌పై పోరుయాత్ర ముగింపు సభలో మాట్లాడారు. చదువుకొని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాల్సిన యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడకుండా తల్లిదండ్రులు గమనించాలని ఎస్ఐ తిరుపతి సూచించారు. హుస్నాబాద్ జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కోఆర్డినేటర్ డ్యాగల సారయ్య, చెప్యాల ప్రకాశ్, ఏపీఎం కుమారస్వామి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సమ్ము రజిత, మహిళలు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి చేయూత



పాడి గేదెను అందిస్తున్న నాయకులు

జమ్మికుంట: పాపక్కపల్లి గ్రామానికి చెందిన బారాల రాజేందర్ అనే కౌలు రైతు అప్పుల బాధ భరించలేక 2024లో ఆత్మహత్యకు పాల్పడగా.. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు పిల్లలున్నారు. రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు బి.కొండల్‌రెడ్డి, ముక్క ఐలయ్య సమన్వయకర్తలుగా ఆ కుటుంబాన్ని పరామర్శించి రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ ద్వారా రూ.40వేలు ఆర్థిక సాయంతో పాడి గేదెను కొనుగోలు చేసి ఆదివారం అందజేశారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ఆదాయం తగ్గి, తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కన్నూరి సదానందం, రాచపల్లి సమ్మయ్య, ఇంజం చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గౌతమబుద్ధుడి జయంతి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 12న వాడుకాపూర్, ధూళికట్ట, 20న బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో నిర్వహించే బుద్ధుడి జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు చందుపట్ల జనార్దన్, కామెర లక్ష్మణ్, నాగెల్లి చంద్రారెడ్డి, సొల్లు బాబు, ఇల్లందుల సమ్మయ్య, కట్కూరి రాజేందర్, రామ్ రాజేశ్వర్, రాజేశ్, తునికి సమ్మయ్య, బొడిగె మల్లయ్య తదితరులున్నారు.

దైవభక్తి పెంచుకోవాలి

రామడుగు: పిల్లలు చిన్నప్పటి నుంచే చదువుతోపాటు దైవభక్తిని పెంచుకోవాలని జిల్లా సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశం సూచించారు. గుండి ఇమ్మానియల్ ఏజీ చర్చిలో పాస్టర్ మచ్చ తిరుపతి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన ఉచిత చిల్డ్రన్ బైబిల్ క్లాసుల ముగింపు కార్యక్రమానికి ఆదివారం హాజరయ్యాడు. రజని, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ ర్యాంకర్‌కు సన్మానం



శంకరపట్నం: యూపీఎస్సీ ఆల్ ఇండియా 11వ ర్యాంకర్ సాయిశివానిని ఆదివారం పురిగిరి క్షత్రీయ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీస రమేశ్ సన్మానించారు. వరంగల్‌కు చెందిన సాయిశివాని రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా పేరు ప్రతిష్టలు తీసుకొచ్చారన్నారు. కార్యదర్శి పోతరాజు శ్రీనివాస్, రజనీకాంత్, కనకయ్య, సందెల వెంకన్న పాల్గొన్నారు.

8న చిడతల భజన ప్రదర్శన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌కల్చరల్: ప్రాచీన గ్రామీణ కళారూపానికి ప్రపంచ గుర్తింపు తేవడానికి కరీంనగర్‌లోని కళాభారతిలో ఈనెల 8వ తేదీన 8 గంటల పాటు చిడతల భజన నిర్విరామ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహక సంస్థ కోఆర్డినేటర్ జి.కృపాదానం తెలిపారు. కరీంనగర్ ఫోక్ ఆర్ట్ అకాడమీ, కళా రవళి సోసియో కల్చరల్ అసోసియేషన్, స్వలాజీ ఈవెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిడతల భజన రికార్డు ప్రదర్శన పోస్టర్‌ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 600 మంది కళాకారులతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు.

నేటి నుంచి వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు వినూత్న కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నుంచి కరీంనగర్ నియోజకవర్గంలో వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించనున్నారు. కొత్తపల్లి మండలం నాగులమల్యాల, బద్దిపల్లి, కరీంనగర్ మండలం చెర్ల భూత్కూర్, గోపాల్‌పూర్ గ్రామాలను ఎంపిక చేశారు. సోమవారం నాగులమల్యాలలో శాస్త్రవేత్తలు ఉషారాణి, విజయ భాస్కర్, మంగళవారం బద్దిపల్లిలో శాస్త్రవేత్తలు శ్రావణి, మధుకర్‌రావులు రైతులతో సమావేశమవుతారు. పంటల సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తారు.